క్లుప్తంగా

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



భీమవరంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను సోమవారం సప్త నిధి లిమిటెడ్ క్యాజీ బ్యాంకింగ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫౌండర్ చైర్మన్ కొల్లి స్వామినాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. కార్యక్రమంలో దాయన చంద్రాజీ, కంచర్ల దుర్గవెంకటేష్, బ్యాంక్ ముఖ్య సలహాదారుడు కొల్లి సత్యనారాయణమూర్తి, డైరెక్టర్ కేవీఎల్ నరేష్, కొల్లి దుర్గశివరాం, ఐవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం



బాలాజీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చినిమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: రాయలం గ్రామానికి చెందిన దంపానబోయిన బాలాజీని పరామర్శించి అండగా ఉంటామని ఆ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు భరోసా ఇచ్చారు. బాలాజీ కుమారుడు నివాష్ వెంకట మణి సాయి (16) గత కొద్ది రోజులుగా బ్రెయిన్‌కు సంబంధించి బ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 20న విజయవాడలోని న్యూరో కార్డియాక్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా రూ.15 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెబుతున్నారని, ఇప్పటికే వైద్యం నిమిత్తం దొరికిన చోటల్లా అప్పులు చేశామని చినిమిల్లి వద్ద వాపోయారు. దీంతో అధైర్య పడవద్దని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చినిమిల్లి భరోసా ఇచ్చారు. ఆయన వెంట గాజుల ప్రసాద్, రోహిత్ తదితరులు ఉన్నారు.

చెరువు పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సొసైటీ అధ్యక్షుడు

పాలకోడేరు: గొల్లలకోడేరు గ్రామంలో బ్రాహ్మణుల చెరువు పూడిక తీత పనులను పాలకోడేరు సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడిక తీత పనులను సకాలంలో పూర్తి చేయడం వల్ల వేసవిలో తాగు నీటి సమస్యకు ఉత్పన్నం కాదన్నారు. ఆయన వెంట ఉండి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కమ్మిలి రాంబాబు, సంబల దీవి వెంకటేశ్వరరావు, కొండపల్లి ఏసు రత్నం, డొక్కు సత్యనారాయణ, నాని తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ప్రతినెలా ఆర్థిక సాయం



పేదలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ ధర్మరాజు

కాళ్ల: ఆనందపురం పంచాయతీ పరిధిలోని మేకలదిబ్బ గ్రామంలో సర్పంచ్ కొలుకులూరి ధర్మరాజు 11 మంది నిరుపేదలకు రూ.500 చొప్పున పింఛను రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఇదేవిధంగా ప్రతినెలా 15వ తేదీన వారికి ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు సర్పంచ్ ధర్మరాజు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బర్రె సీతారామస్వామి, గ్రామపెద్దలు రుద్ర వెంకట్రావు, మోకా తాతయ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. పెనుమదం గ్రామంలోని అయ్యప్ప ఫెర్టిలైజర్స్ ఎరువుల షాపును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా 401 మెట్రిక్ టన్నులు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎటువంటి కొరత లేదన్నారు. డీలర్లు ఎంఆర్పీ ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పాలకొల్లు ఏడీఏ మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి విశ్వేశ్వరరావు, ఎస్ కాశీవిశ్వనాథం, రైతులు పాల్గొన్నారు.

మత్స్య శాఖ.. ప్రయోజనం లేక

- సిబ్బంది లేని మత్స్యశాఖ
- బదిలీలతో ఇన్‌చార్జే గతి
- ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న ఆక్వా రైతులు



ఆకివీడులో మత్స్యశాఖ కార్యాలయం, ల్యాబ్



ఆక్వా చెరువు

ఆకివీడు: అక్రమ చెరువుల తవ్వకాలను అడ్డుకునేందుకు, ఆక్వా రైతులకు తగిన సూచనలు ఇచ్చేందుకు మత్స్య శాఖ కార్యాలయంలో ఆకివీడులో ఉన్నా.. సిబ్బంది లేకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. దీంతో అనుమతులు లేకుండా చెరువుల తవ్వకం ఇష్టారాజ్యంగా సాగుతోంది. మండలంలోనూ, స్థానికంగా పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చెరువుల్ని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు పంటకాల్వలు, మురుగు కాల్వల గట్లుకు చేరి చెరువుల్ని తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడులేడు. స్థానికంగా సాయినగర్ ప్రాంతంలో ఇటీవల చెరువుల తవ్వకం వేగం పుంజుకుంది. అనుమతులులేని, ఆక్వా జోన్‌పరిధిలో లేని ప్రాంతాల్లో కూడా చెరువులు తవ్వేస్తున్నారు. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకుని మరీ చెరువులు తవ్వుతున్నా పట్టించుకోవడంలేదని సరిహద్దు రైతులు వాపోతున్నారు.

ఆరు మండలాలకూ ఒకే ఎఫ్‌డీఓ

మండల మత్స్యశాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆకివీడు, ఉండి మండలాలకు కలిపి ఆకివీడు ఎఫ్‌డీఓ పనిచేస్తున్నారు. ఇటీవల బదిలీలతో పోస్టు భర్తీకాలేదు. ఈ మండలాలతో పాటు మరో మూడు మండలాలకు కలిపి ఒకే ఎఫ్‌డీఓను నియమించారు. మొగల్తూరు మండల ఎఫ్‌డీఓ వివేక్‌ను ఆకివీడు మండలానికి ఇన్‌చార్జిగానూ, భీమవరం లోని మత్స్యశాఖలో సాంకేతిక విభాగానికి ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఏ మండలంలో ఏమి జరుగుతుందో ఆయనకు తెలియని పరిస్థితి. మండలాలకు వచ్చిన దాఖలాలే లేవు.

ఎఫ్‌డీఓ ఆఫీస్ ఖాళీ

ఆకివీడు మత్స్యశాఖ కార్యాలయం ఖాళీగా ఉంది. నూతన భవన సదుపాయం, ల్యాబ్ సౌకర్యం ఉన్నప్పటికీ ఇక్కడ పనిచేసే నాథుడులేడు. రైతులకు సలహాలు, సూచనలిచ్చే వారేలేరని ఆక్వా రైతులు వాపోతున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తుందంటున్నారు. ఎఫ్‌డీఓ లేకపోవడం, ల్యాబ్ ఇన్‌చార్జిలు లేకపోవడంతో కార్యాలయం వెలవెలబోతుంది.

చేపలు, రొయ్యల సాగు అధికం

ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లో చేపలు, రొయ్యల సాగు అధికంగా ఉంది. దీంతో ఈ ప్రాంతానికి అనుకూలంగా ల్యాబ్‌ను ఆకివీడులో కోట్లాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. ల్యాబ్ ఏర్పాటు చేసిన తరువాత సిబ్బందిని నియమించినప్పటికీ రైతులకు అందుబాటులో పూర్తిస్థాయిలో లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఆకివీడు, కాళ్ల మండలాల్లో సుమారుగా 58 వేల ఎకరాలు, ఉండి మండలంలో సుమారు 18 వేల ఎకరాలలో ఆక్వా సాగు కొనసాగుతోంది. ల్యాబ్ అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఆయా మండలాల్లో ప్రైవేటు ల్యాబ్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

భీమవరం: స్థానిక 28వ వార్డు రెస్ట్ హౌస్ రోడ్డులో సోమవారం క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డీఆర్వో వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 79,214 స్మార్ట్ కార్డులకుగాను భీమవరంలో 59,251, వీరవాసరంలో 19,963 స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. నాలుగు దశల్లో ఈ కార్డులను అందిస్తున్నామని, మొదటి దశ ఈనెల 31 వరకు, రెండో దశ సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు, మూడో దశ 16 నుంచి 20, నాల్గో దశ 21వ తేదీ నుంచి అందిస్తామని చెప్పారు.

పాలు మృతికి సంతాపం

పెనుగొండ: గుమ్ములూరు మాజీ సర్పంచ్ గొట్టుముక్కల పాలు మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎనిమిదేళ్లపాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి పాలు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి సుధాకర్, మాజీ ఎంపీటీసీ కుడిపూడి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు విప్పర్తి ప్రభాకర్, పైడి ఈశ్వరరావులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులే పర్యావరణానికి మేలు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి



ఆకివీడులో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టి విగ్రహాలు అందించిన దాతలు నరసాపురం పట్టణానికి చెందిన విశ్వేశ్వర సేవా సదన్ డా.కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, శిరిపుష్ప దంపతులను కలెక్టర్ నాగరాణి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాల వలన జలవనరులు కలుషితమై ఎన్నో జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, డీటీ ఎం.సన్యాసిరావు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటు

ఆకివీడు: చవితి ఉత్సవాలకు ఆయా పందిళ్ల వద్ద భారీ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. చవితి బుధవారం రాగా విగ్రహాల్ని ఆయా పందిళ్ల వద్ద కొందరు సోమవారం, మరికొందరు మంగళవారం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. స్థానిక దుంపగడప అడ్డరోడ్డు వద్ద భారీగా వినాయక విగ్రహాల్ని తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేస్తున్న విగ్రహాల్ని కొనుగోలు చేస్తుండడం గమనార్హం.

బాల్యవివాహాలు చేస్తే జైలు శిక్ష తప్పదు



కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుధారాణి

భీమవరం: బాల్యవివాహాలకు పాల్పడితే జైలు శిక్షతోపాటు జరిమానా తప్పదని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి అన్నారు. సోమవారం భీమవరం డీఎన్నార్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బాల్య వివాహాల నిషేధంపై అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహం చేసినా, వివాహానికి హాజరైన వారందరూ నేరస్థులేనన్నారు. దీనికిగాను నేరం రుజువైతే రెండేళ్ల వరకూ జైలుశిక్ష, రూ.లక్ష వరకూ జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై యోహాన్, ప్యానల్ న్యాయవాదులు ఎన్ సుధీర్, పి.అంబేద్కర్, కె.జ్యోతి, మీడియేషన్ న్యాయవాది కె విజయలక్ష్మి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, జిల్లా గిరిజన శాఖ అధికారిణి డి పుష్పరాణి, టూటౌన్ ఎస్సై రహమాన్, పారా లీగల్ వాలంటీర్లు కె చంద్రరావు, కె కాశేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ కె శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు



పోలీసు సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సాంకేతిక అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కంప్యూటర్ ఆపరేటింగ్ కానిస్టేబుళ్లు కృషి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి చెప్పారు. పోలీసు శాఖలో అమలుచేస్తున్న నూతన సాంకేతికత విధానాలపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటింగ్ కానిస్టేబుళ్లకు ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్, ఏపీ కమ్యూనిటీ పోలీసింగ్ సొల్యూషన్, ఇంటర్–ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, ఇంటిగ్రేటెడ్ రోడ్డు ఆక్సిడెంట్ డేటాబేస్, క్రైమ్ మల్టీ ఏజెన్సీ సెంటర్, ఈ సాక్ష్య వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రధానంగా సమాచార నమోదు సమయంలో ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తి సమాచారాన్ని ఏ విధంగా నమోదు చేయాలి వంటి పలు అంశాలపై సిబ్బందికి జిల్లా ఐటీ కోర్ టీం పూర్తి అవగాహన కల్పించింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలను మరింత ప్రభావవంతంగా, పారదర్శకంగా మార్చడానికి సాంకేతికత కీలకమని నూతన సాంకేతిక విధానాలను సరిగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన సేవలను అందించవచ్చునన్నారు. దీనివల్ల నేర నియంత్రణ మరింత సులభమవడమేగాక ప్రజలకు, పోలీసులకు మధ్య ఉన్న బంధం మరింత పటిష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, సైబర్ అండ్ సోషల్ మీడియా ఎస్సై రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుప్పపట్టిన ప్రజాధనం



ఉండి ఏఎంసీలో తుప్పపట్టిన ఐరన్

ఉండి: ప్రజాధనం తుప్పుపడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటిన్నర సెంటు ఇంటిస్థలం మంజూరు చేసి ఇల్లు కట్టుకునేందుకు రుణమిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకునేలా మెటీరియల్ ఇసుక, ఇటుక, ఐరన్ ఇలా ప్రభుత్వం నుంచి అందజేసి సహకరించారు. ఉండి, కాళ్ళ, ఆకివీడు మండలాల కొరకు ఉండి ఏఎంసీలో ఇళ్ల నిర్మాణం కొరకు ఐరన్‌ను భద్రపరచారు. ఇళ్లు కట్టుకునే వారికి ఇక్కడ నుండే మెటీరియల్‌ను అధికారులు అందజేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే సీన్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా నిర్మాణం కాలేదు. నిరుపేదలు, కూటమి ప్రభుత్వం ఇంటి రుణాలు మంజూరు చేస్తుందని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. దీంతో ఇంటి నిర్మాణాల కోసం నిలువ ఉంచిన ఐరన్ తుప్పుపట్టిపోతోంది. లక్షలు విలువ చేసే ఐరన్‌ను ఇలా గాలికి వదిలేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీలతోపాటు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి బలరామ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు ట్రూ ఆప్ చార్జీలు, మరోవైపు పెంచిన విద్యుత్ చార్జీలు వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే మరోవైపు ప్రజలపై విద్యుత్ భారాలను మోపడం అన్యాయమన్నారు. తక్షణం విద్యుత్ భారాలను తగ్గించకుంటే ఉద్యమాన్ని చేపడతామని బలరామ్ హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కొరు పెద్దిరాజు, బి వాసుదేవరావు, చింతకాయల బాబురావు, పీవీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

నరసాపురం: వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగింపు ప్రక్రియ ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీఓ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉండి చాలాకాలంగా దివ్యాంగుల పింఛను తీసుకుంటున్న కొందరి పింఛన్లు ఇటీవల తొలగిస్తున్నట్లు నోటీసులు పంపడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియ కొనసాగిస్తే చాలామంది దివ్యాంగులు తమ పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగుల పట్ల మానవత్వం చూపి వారి పింఛన్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మొత్తం 64 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో ఉన్న భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం అమ్మ కోసం ఒక చెట్టు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ళ భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం పెన్నాడ గ్రామ కార్యదర్శి శ్రీ కె వెంకటరాజుని సత్కరించి కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మేరా యువభారత్ పశ్చిమగోదావరి అధికారి కె రాజేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ కే రాగిణి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం చవితి వేడుక



ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమల తయారీలో విద్యార్థులు

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు వినాయక చవితి పండుగ దోహదం చేస్తుందని స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసూన మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను 21 రకాల ఔషధ విలువలు ఉన్న పత్రితో పూజించి వాటిని మంచినీటి చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా తాగునీరు పరిశుభ్రమయ్యేదని వివరించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ జి ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళాకారిణి శ్రీదేవికి సత్కారం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారం ప్రదక్షిణల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి అభిషేకాలు. అర్చనలు చేశారు. భరతనాట్య ప్రదర్శన చేసిన అమలాపురానికి చెందిన గొలకోటి శ్రీదేవిని అధికారులు ఘనంగా సత్కరించారు.

స్పందనకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(స్పందన)కు సోమవారం 4 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు చెప్పారు. సిద్ధాపురం గ్రామంలో రీ సర్వేలో తగ్గిన వ్యవసాయ భూమిని సరిజేయాలని రైతు నంబూరి సోమరాజు ఫిర్యాదు చేశారన్నారు. స్థానిక జానకీనగర్‌లో దారి మార్గం లేకుండా స్థలం ఆక్రమించారని కారంకి జయలక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు. అందెవారి బోదె వద్ద ఏడుపులతో కూడిన ప్రార్థనలు చేస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేయగా, అజ్జమూరు గ్రామంలోని దేవస్థానం పాలక వర్గంలో అన్యమతస్తుడు బుంగా నరేష్‌ను ఆలయ ధర్మకర్తగా నియమించారని గ్రామానికి చెందిన వర్థినేని లక్ష్మీ వరప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

అజ్జమూరులో రేషన్ షాపు ఏర్పాటు చేయండి

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ శివారు గరువు ప్రాంతంలో రేషన్ ఇవ్వడం వల్ల రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 550కి పైగా రేషన్ కార్డులున్నాయని, వాటిలో 400 కార్డులు గ్రామంలోనే ఉన్నాయని, మిగిలినవి గ్రామ శివారు గరువు ప్రాంతంలో ఉన్నాయని చెబుతున్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తీసుకుని, మోసుకుని రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుందంటున్నారు. గ్రామానికి అందుబాటులో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని లేదా, గ్రామ దేవాలయం వద్ద రేషన్ బియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు అభినందనలు



కానిస్టేబుల్ ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ

భీమవరం: హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 42.2 కిలోమీటర్ల మారథాన్ రన్ కార్యక్రమంలో ఫినిషర్ మెడల్ సాధించిన ఆర్మర్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ ఎస్ వీఎస్ ప్రసాద్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ కేవలం 4 గంటల 19 నిమిషాల వ్యవధిలో రన్‌ను పూర్తి చేసి ఫినిషర్ మెడల్ సాధించిన ప్రసాద్ క్రమశిక్షణ, నిబద్ధత అందరికీ ఆదర్శనీయమన్నారు. పోలీసు ఉద్యోగంలో శారీరక, మానసిక దృఢత్వం అత్యంత ముఖ్యమని అన్నారు.

కూటమి వైఫల్యాలపై ప్రచారం



నేరేడుమిల్లిలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పార్టీ పటిష్టానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు కోరారు. నేరేడుమిల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిపై ప్రజలకు వివరించాలని అన్నారు. మోసపూరిత ప్రభుత్వంలో రైతులకు యూరియా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగ పింఛన్‌లో కోత పెట్టడం దారుణమన్నారు. పార్టీ గ్రామ, మండల, అనుబంధ కమిటీలపై చర్చించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, పార్టీ సీనియర్ నాయకులు బోనం బులి వెంకన్న, పెన్మత్స బుజ్జిరాజు, జల్లి నాగేశ్వరరావు, గుడాల సురేష్, కళ్యాణం గంగాధరరావు, కుక్కల బాలచంద్రన్, నామన సుబ్బారావు, దూనబోయిన వెంకన్న, తాడి రత్నరాజు, మానుకొండ దేశంగిరాజు, పలివెలి రత్నరాజు, బొక్కా రంగారావు, కాలాబత్తుల నాగేశ్వరరావు, దండు గణేష్, కళాబత్తుల ఉదయ్ భాస్కర్, జల్లి శాంతారావు, గుండె మహేష్, పాల మూరి పవన్, బొక్కా లక్ష్మీనారాయణ, తాడి లాలూ ప్రసాద్, కంబాల శ్రీను, ఆకుమర్తి వెంకన్న, తాళ్లూరి రత్నరాజు, మల్లిపూడి పెద్దిరాజు, దాకే సూరయ్య పాల్గొన్నారు.